సాక్షి మహబూబ్‌నగర్

మంగళవారం । 16 । ఏప్రిల్ । 2024



పైరవీకారులదే రాజ్యం

జడ్చర్లలోని తహసీల్దార్ కార్యాలయంలో పైరవీకారులదే రాజ్యం నడుస్తోంది.

వివరాలు 8లో ▸



అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

వరుస చోరీలతో హడలెత్తించిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేశారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం 42.6 /21.0

వాతావరణం

ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు బలంగా వీస్తాయి. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

పీయూలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో సోమవారం క్యాంపస్ రిక్రూట్‌మెంట్ కార్యక్రమాన్ని దివాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి వివిధ గ్రూప్‌లకు సంబంధించి మొత్తం 65 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, దివిస్ ల్యాబ్స్ హెచ్‌ఆర్ హరికృష్ణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అర్జున్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్‌లో చురుగ్గా పాల్గొనాలి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఓటింగ్‌లో యువత చురుగ్గా పాల్గొనాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి డా.శ్రీధర్‌సుమన్ సూచించారు. సోమవారం స్థానిక ఎన్టీయార్ మహిళా డిగ్రీ కళాశాలలో సింపోజియం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, కొత్త ఓటర్ల చైతన్యం కోసం కృషి చేయాలన్నారు. ముఖ్యంగా 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. 'ఎన్నికల పర్వం, దేశానికి గర్వం' అనే నినాదంతో విద్యార్థులు, వలంటీర్లు ఎన్నికల కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలన్నారు. ఓటు వజ్రాయుధమని, ప్రజలే ప్రభువులని సందేశమిచ్చిన బీఆర్ అంబేడ్కర్ దేశ ప్రజలకిచ్చిన ప్రజాస్వామిక హక్కులను గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్, లైబ్రేరియన్ ఆంజనేయులు, అధ్యాపకురాలు పుష్పలత పాల్గొన్నారు.

ప్రజలను నిరాశపరిచిన బీజేపీ మేనిఫెస్టో

స్టేషన్ మహబూబ్‌నగర్: బీజేపీ విడుదల చేసిన మేనిఫెస్టో ప్రజలను నిరాశపరిచిందని ఏఐసీసీ కార్యదర్శి, పార్లమెంట్ ఇన్‌చార్జ్ సంపత్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ మేనిఫెస్టోలో ఏమి పెడతారో ప్రజలు ఆశలు పెంచుకున్నారని, ఊరించి ఉసూరుమనిపించట్లుగా ఉందని ఆరోపించారు. ఈ ప్రాంత ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ఏ ఒక్క హామీ లేకపోవడం దురదృష్టకరమన్నారు. దేశంలోని ఏ వర్గానికి కూడా సంతృప్తి పరిచేలా బీజేపీ మేనిఫెస్టో లేదన్నారు. 70 ఏళ్లకు పైబడిన వారికి వైద్యం కోసం రూ.5లక్షలు ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టారని, 20 ఏళ్ల క్రితమే దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి కాంగ్రెస్ హయాంలో ఆరోగ్యశ్రీ పేరిట రూ.5 లక్షలు ఇచ్చారని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షలు అందజేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం, వెనకబడిన మహబూబ్‌నగర్ జిల్లాకు ఏమి ఒరిగిందేమిలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎన్పీ వెంకటేశ్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం



దేవరకద్ర/జడ్చర్ల: దేవరకద్రలోని మార్కెట్ యార్డుకు సోమవారం ధాన్యం పోటెత్తింది. గత వారం అంతా మార్కెట్‌కు సెలవులు రావడంతో కోతలు కోసిన రైతులు పెద్దఎత్తున ధాన్యం అమ్మకానికి తెచ్చారు. మార్కెట్ యార్డులోని సీసీ రోడ్లన్నీ ధాన్యం కుప్పలతో నిండిపోయింది. దాదాపు 10 వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చినట్లు అధికారులు అంచనాలు వేశారు. అయితే మార్కెట్‌లో జరిగిన టెండర్లలో సోనామసూరి క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,502, కనిష్టంగా రూ.1,851 చొప్పున పలికాయి. అలాగే ఆముదాలు గరిష్టంగా రూ.5,611, కనిష్టంగా రూ.5,529 ధరలు లభించాయి.

వేరుశనగ క్వింటాలు రూ.6,771

బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమ వారం వేరుశనగకు క్వింటాలు గరిష్టంగా రూ. 6,771, కనిష్టంగా రూ.5,329 ధరలు లభించాయి. అలాగే మొక్కజొన్న గరిష్టంగా రూ.2,237, కనిష్టంగా రూ.2,007, ఆముదాలు గరిష్టంగా రూ.5,725, కనిష్టంగా రూ. 5,380, ఆర్ఎన్ఆర్ రకం గరిష్టంగా రూ. 2,609, కనిష్టంగా రూ.2,190, హంస రూ. 2,211, రాగులు గరిష్టంగా రూ.3,000, కనిష్టంగా రూ.1,800, జొన్నలు గరిష్టంగా రూ. 5,238, కనిష్టంగా రూ.2,711 పలికాయి.

అంతా మీ చేతుల్లోనే..

- కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి
- నారాయణపేట జనజాతర సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- విపక్షాలపై ఫైర్.. సెంటిమెంట్ అస్త్రం



అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/నారాయణపేట: 'కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి. అందరూ ఏకమయ్యారు. ఎమ్మెల్యే ఎన్నికల కంటే కష్టపడాలి. లోక్‌సభ ఎన్నికలు జరిగిన మరుక్షణం స్థానిక సంస్థల ఎన్నికలు వస్తాయి. మీరు ఊళ్లలో పట్టు సడలిస్తే.. రేపు ఎవరో ఒకరు మోపు అయి వార్డు మెంబర్, సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీలుగా వస్తారు. అప్పు మీకు తలనొప్పి.. ఖర్చు మోపెడైతది. ఎంపీ ఎన్నికలు అయిన వెంటనే స్థానిక ఎన్నికలు పెట్టి.. మిమ్మల్ని గెలిపించుకుంటాం. పార్టీ కోసం పని చేసే వారిని గుర్తు పెట్టుకుంటాం. మీ త్యాగాలు గుర్తుపెట్టుకుని అవకాశాలు కల్పించడమే కాదు.. గెలిపించుకుని తీరుతాం. మీ శ్రమ ఊరికే పోదు.' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపారు. నారాయణపేట జిల్లా వేదికగా సోమవారం ఆయన పార్లమెంట్ ఎన్నికల ప్రచార శంఖారావం పూరించారు. **ఈ మేరకు క్రీడా మైదానంలో నిర్వహించిన జనజాతర సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు.** గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసి పేదలను ఆదుకునే బాధ్యతను మీ చేతుల్లోనే పెడతామని.. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానాలు గెలవాలని పిలుపునిచ్చారు. 'నా పాలమూరులో తప్పు జరిగితే జాతీయ స్థాయిలో చెప్పుకునే పరిస్థితే ఉండదు.. మీరు అండగా ఉండి ఆశీర్వదిస్తే 14 అసెంబ్లీ స్థానాల్లో 12 గెలిచాం. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామన్నారు. 'నేను మీ బిడ్డను.. మీరు పెట్టిన చెట్టు వృక్షమైంది.. దాన్ని నరికేందుకు ఢిల్లీ నుంచి ఒకరు, ఫామ్ హౌస్ నుంచి ఒకరు వస్తున్నారు. అంతా మీ చేతుల్లోనే ఉంది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని లక్ష మెజార్టీతో గెలిపించాలి' అని విజ్ఞప్తి చేశారు.



జనజాతర సభకు హాజరైన కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు

కోడ్ ముగిసిన వెంటనే అమల్లోకి..

రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఫ్రీ కరెంట్ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో అమలవుతోందని రేవంత్ తెలిపారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో కోడ్ అమల్లోకి రావడంతో ఈ హామీలు ఉమ్మడి పాలమూరు జిల్లాలో అమలు కాలేదని.. కావాలనే బీజేపీ కోడ్ పెట్టి ఈ హామీలను అడ్డుకుందని విమర్శించారు. దీనిపై ప్రజల్లో ఎన్నో అనుమానాలున్నాయని.. కోడ్ ముగిసిన వెంటనే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ రెండు పథకాలను అమలు చేస్తామన్నారు.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.4 వేల కోట్లతో ఈ ప్రాంతంలో ప్రతి ఎకరానికి నీళ్లు అందించాలనే ఉద్దేశంతో మక్తల్–నారాయణపేట–కొడంగల్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశామన్నారు.. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు ఈ ప్రాంతానికి సంబంధించిన కృష్ణా–వికారాబాద్ రైల్వేలైన్ సాధనలో పూర్తిగా విఫలమయ్యాయని, ఈ లైన్ కోసం కేంద్రంతో ఇటు బీజేపీ, అటు బీఆర్ఎస్ నాయకులు మాట్లాడిన పాపాన పోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే కేంద్ర రైల్వేశాఖ మంత్రితో చర్చించి కృష్ణా–వికారాబాద్ రైల్ లైన్‌ను సాధించామన్నారు.

పాలమూరుకు జాతీయ హోదా తెచ్చారా?

మోదీని ప్రధాని చేయాలని.. రేవంత్‌రెడ్డిని ఓడగొట్టాలని ఇక్కడ బీజేపీ అభ్యర్థి అనుకుంటున్నారు. పదేళ్ల నుంచి మోదీ ప్రధానిగా ఉన్నారు కదా.. ఏ రోజైనా పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా అడిగారా.. నిధులు తెచ్చారా అని రేవంత్ ప్రశ్నించారు. ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి ఏ గ్రూప్‌లో మార్చడానికి, మాదిగ బిడ్డల ఏబీసీడీ వర్గీకరణ గురించి అడిగారా.. మహబూబ్‌నగర్–రాయచూర్ రోడ్డు ఎందుకు పడావ్ పడింది.. మక్తల్–నారాయణపేట ఎత్తిపోతల పథకానికి జాతీయ నిధులు ఏమైనా తెచ్చారా అని మండిపడ్డారు. పాలమూరును ఎండబెట్టి.. లక్షలాదిగా వలసలు పోతుంటే ఒక్క రోజు పట్టించుకోలేదని.. అయినా బీజేపీకి ఓటు వేయాలి.. రేవంత్‌ను ఓడగొట్టాలని అంటున్నారని ధ్వజమెత్తారు.

బలహీనపర్చాలనే ఉద్దేశంతోనే..

కాంగ్రెస్ వచ్చిన 100 రోజుల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాం.. 30వేల ఉద్యోగాలు ఇచ్చాం.. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఇంటికి ఉచిత కరెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీ ఇచ్చాం.. ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం.. ఇందుకు రేవంత్‌ను ఓడగొట్టాలా అని ప్రశ్నించారు. తనతోపాటు మంత్రివర్గ సహచరులు రోజుకు 18 గంటలు పనిచేస్తున్నారని, రాత్రి, పగలు కష్టపడుతున్నామని వివరించారు. బూర్గుల రామకృష్ణారావు తర్వాత తెలంగాణ రాష్ట్రానికి మళ్లీ పాలమూరు నుంచి మీ బిడ్డ సీఎం అయితే ఎందుకు ఓర్వడం లేదని.. మా ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునే హక్కు మాకు లేదా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డిని బలహీనపరచాలనే ఉద్దేశంతో అరుణమ్మ బీఆర్ఎస్‌తో కుమ్మక్కయ్యారని విమర్శలు గుప్పించారు. మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఐదేళ్లు ఎక్కడిపోయారని ప్రశ్నించారు. అమరచింత బీఆర్ఎస్ జెడ్పీటీసీ సరోజ, నర్వ జెడ్పీటీసీ జ్యోతిలు సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేశారు. సభలో ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వీర్లపల్లి శంకర్, జెడ్పీచైర్‌పర్సన్లు వనజ, స్వర్ణ సుధాకర్, సరిత, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, టీపీసీసీ కల్లుగీత కార్మిక రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ హోదా అడిగావా..: వంశీచంద్

ప్రధాని నరేంద్రమోదీ దగ్గరకు వెళ్లి ఈ ప్రాంతానికి ఒక్క రూపాయి తెచ్చావా.. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా అడిగావా.. కృష్ణా– వికారాబాద్ రైల్వే లైన్‌పై విన్నవించావా.. ఇవన్నీ అడగకుండా కేవలం బీజేపీలో జాతీయ ఉపాధ్యక్షురాలు పదవి కావాలని మోదీని అడుక్కున్న దొరసానివి నువ్వు. ఎన్నికలు వచ్చినప్పుడు నాది నారాయణపేట అంటున్నావ్.. పేట బిడ్డవైతే సైనిక్ స్కూల్ పోతుంటే ఎందుకు ఆపలేదు.. ధన్వాడ బిడ్డవని చెబుతవ్.. ధన్వాడ చెరువును మంత్రిగా ఉన్నప్పుడు ఎందుకు నింపలేదు. కేవలం ఓట్ల కోసమే మాట్లాడుతున్నావ్ తప్ప.. ఈ ప్రాంత అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదు. పద్మశాలీలకు పెద్దఎత్తున టెక్స్‌టైల్ పార్కు రావాలన్నా.. ప్రతి గ్రామంలో రోడ్లు కావాలన్నా.. పేటలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించాలన్నా.. హస్తం గుర్తుకు ఓటు వేసి ఎంపీగా గెలిపించండి అని ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి విన్నవించారు.

ఎస్సీ వర్గీకరణ ఎక్కడ?

మాయమాటలతో మందకృష్ణను బుట్టలో వేసుకొని.. ఎస్సీ వర్గీకరణ చేస్తామంటున్న బీజేపీ మేనిఫెస్టోలో ఈ విషయం ఎక్కడ ఉందో చెప్పాలని, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పేర్కొన్నారు. ఇంకో పార్టీ బీఆర్ఎస్ పాతాళానికి పోయిందన్నారు. రేవంత్ చేసే పనులు చూసి దేశ ప్రజలు మెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు.

పేటలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించాలి

పేట మున్సిపాలిటీలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని, కోయిల్‌సాగర్ బ్యాక్‌వాటర్ నుంచి కోయిలకొండ మండలం గణపతిరాయ చెరువు నింపాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి కోరారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో తనకిచ్చిన మెజార్టీ కంటే రెండింతలు ఎక్కువ వంశీచంద్‌రెడ్డికి ఇచ్చి గెలిపించాలి.

■ దమ్మున్న నాయకుడు రేవంత్‌రెడ్డి ప్రచారం ఇక్కడి నుంచి ప్రారంభించడం కాంగ్రెస్ విజయానికి నాంది పలుకుతుందని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేకాధికార ప్రతినిధి, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. చేనేత పరిశ్రమల ఏర్పాటును, సైనిక్ స్కూల్‌ను గత ప్రభుత్వం రద్దు చేసిందని, వంశీ గెలిచిన తర్వాత ఈ ప్రాంతానికి సైనిక్ స్కూల్ మంజూరు చేయిస్తామన్నారు.

■ ముదిరాజ్‌ల చిరకాల కోరిక అయిన బీసీ–డీ నుంచి బీసీ–ఏ మార్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడంపై ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగాలంటే కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.



అభిమాని ఇచ్చిన కత్తిని ప్రదర్శిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి, జెడ్పీచైర్‌పర్సన్ సరిత, సంపత్‌కుమార్, కొత్వాల్

రైతులను విస్మరించిన కాంగ్రెస్



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి

- కేసీఆర్ కిట్లు బంద్ అయ్యి తిట్లు చాలయ్యాయి
- అక్రమ కేసులకు భయపడం.. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

కోస్గి: రాష్ట్ర అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేసిన కేసీఆర్ అన్నివర్గాల ప్రజల కోసం పథకాలు అమలు చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా పాలనలో పూర్తిగా విఫలమైందని, చివరకు ప్రభుత్వ ఆస్పత్రిలో పురుడు పోసుకున్న బాలింతలకు ఇచ్చే కేసీఆర్ కిట్లు బంద్ అయ్యి తిట్లు చాలయ్యాయని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం కోస్గిలో ఏర్పాటు చేసిన కొడంగల్ నియోజకవర్గ స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆనాడు కేసీఆర్ రూ.90 వేల కోట్లతో సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసి కావాల్సినన్ని ట్రాన్స్‌ఫార్మర్లతో రైతులకు 24 గంటల పాటు ఉచితంగా నాణ్యమైన విద్యుత్ ఇస్తే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే వ్యవసాయ రంగం అతలాకుతలమైందన్నారు. రైతులకు రూ.15 వేల రైతు భరోసా, 24 గంటల విద్యుత్, వరికి అదనపు బోనస్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతులతోపాటు తులం బంగారు పేరుతో ఆడబిడ్డలు, స్కూటీల పేరుతో చదువుకున్న యువత, నిరుద్యోగ భృతి అంటూ నిరుద్యోగులు, నాలుగు డీఏలు అంటూ ప్రభుత్వ ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు ఇలా అన్ని వర్గాలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 13 హామీలను అమలు చేయాలన్నారు. గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు పెట్టి బెదిరిస్తున్నారని, ఏ ఒక్క కార్యకర్త భయపడవద్దని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజలు బాధపడుతున్నారు..

కేసీఆర్ పాలనలోనే అన్నివర్గాలకు అభివృద్ధి ఫలాలు అందాయని, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి పెద్ద తప్పు చేశామని రాష్ట్ర ప్రజలు బాధ పడుతున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లోనైనా బీఆర్ఎస్‌కు ఓటేసి ఆశీర్వదిస్తే ప్రజల పక్షాన పోరాటం చేసేందుకు కేసీఆర్ సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలు మరోమారు మోసపోకుండా బీఆర్ఎస్ పార్టీకి మద్దతునిచ్చి పార్లమెంట్ ఎన్నికల్లో పాలమూరు నుంచి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలన్నారు.

చివరి వరకు కేసీఆర్‌తోనే ఉంటా

తన సోదరుడు పట్నం మహేందర్‌రెడ్డి పార్టీ మారాడని, తాను కూడా కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తూ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల్లో అయోమయ పరిస్థితి సృష్టిస్తున్నారని, తాను చివరి వరకు బీఆర్ఎస్‌ను వీడేది లేదని, కేసీఆర్‌తోనే ఉంటానని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తూ అక్రమంగా కేసులు పెడుతున్నారని హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లానని.. అవసరమైతే కొడంగల్‌లోనే ప్రత్యేకంగా ఓ లీగల్ సెల్ ఏర్పాటు చేసి కార్యకర్తలు, నాయకులకు పార్టీ అండగా ఉంటుందని అధిష్టానం భరోసా ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, రాజేందర్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి, అంజయ్యయాదవ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, స్పోర్ట్స్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, నాయకులు మహిపాల్, బాల్‌సింగ్, సలీం, విజయ్‌కుమార్, రాజు, మోహన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి..

గతంలో కేసీఆర్ సారథ్యంలో రాష్ట్ర అభివృద్ధి కోసం పార్లమెంట్‌లో తనవంతు పాత్ర పోషించానని, తనపై నమ్మకంతో కేసీఆర్ మరోమారు అవకాశం ఇచ్చారని, మీరందరు ఆశీర్వదించి రెండోసారి అవకాశం ఇస్తే అభివృద్ధికి కృషిచేస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానికుడిగా ఉన్న తనకు పాలమూరు ప్రజల సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, స్థానికేతరులకు అవకాశం ఇచ్చి మోసపోవద్దన్నారు. ఎందరు భయభ్రాంతులకు గురిచేసిన కేసీఆర్‌ను వదిలేది లేదని, ఇతర పార్టీల మాయమాటలు నమ్మకుండా పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు.

ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వర్తించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: లోక్‌సభ ఎన్నికలలో ఏఆర్ఓలు, నోడల్ అధికారులు తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి.రవినాయక్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అధికారులతో సన్నద్ధత, ఎన్నికల్లో వారికి కేటాయించిన విధులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధులు ఎంతో జాగ్రత్తగా, ఎలాంటి ఫిర్యాదులకు తావులేకుండా చేపట్టాలన్నారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు.. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ వారీగా ఓటర్ నమోదు, చేర్పులు, మార్పులకు వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నవి వెంటనే పరిష్కరించాలన్నారు. ఎపిక్ కార్డులు ప్రింటింగ్ పూర్తికాగానే పోస్టల్ శాఖ ద్వారా పంపిణీ చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో విద్యుత్, తాగునీరు, టాయిలెట్లు తనిఖీ చేయాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజవర్గంలో మహిళలతో నిర్వహించే ఐదు పోలింగ్ కేంద్రాలు, మోడల్ పోలింగ్ కేంద్రాలు, యువత నిర్వహించే పోలింగ్ కేంద్రాలు ఒకటి చొప్పున ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో దివ్యాం గులకు, వీల్ చైర్స్, రవాణా సదుపాయాలు కల్పించాలన్నారు. సాక్ష్యం యాప్ నమోదుపై దివ్యాంగులు, వృద్ధులకు అవగాహన కల్పించాలన్నారు. హోమ్ ఓటింగ్, దానికి కావాల్సిన టీమ్‌లు, రూట్ల వారీగా ఏర్పాటు చేసుకొని ఉండాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం లేదా ఈడీసీ ఎన్నికల విధుల్లో ఉన్న వారికి అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల ఫిర్యాదులు, సీవిజిల్ ద్వారా ఎన్నికల ఉల్లంఘన ఫిర్యాదులు నిర్దేశిత సమయం లోగా పరిష్కరించాలన్నారు.



కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రవినాయక్

తాగునీటి సమస్య తలెత్తొద్దు..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అన్ని గ్రామాలు, పట్టణాల్లో నిరంతరం పర్యవేక్షించి తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జి.రవినాయక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి మండలాలలోని ఆయా శాఖ అధికారులతో వెబెక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌డీఎఫ్ ద్వారా మంజూరైన 186 పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. బోర్‌వెల్ ఏర్పాటు చేసిన చోట తప్పనిసరిగా మోటారు బిగించాలని సూచించారు. నల్లాల నుంచి వచ్చే తాగునీటిని వృథా కాకుండా, నీటిట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్ వేసి శుభ్రం చేయాలన్నారు. వేసవికాలంలో రెండు నెలలపాటు అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా హరితహారం మొక్కలు ఎండిపోకుండా నీరు పట్టాలని, అలాగే జంతువులకు అందించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, ఎస్.మోహన్‌రావు, డీపీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పనులు నాణ్యంగా చేయాలి..

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టే పనులు నాణ్యంగా ఉండాలని కలెక్టర్ జి.రవినాయక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పీఆర్, హౌసింగ్, ఎంఈఓలు, ఇంజినీరింగ్ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. తరగతి గదులను మరమ్మతు చేయాలని, నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లను వినియోగంలోకి తేవాలన్నారు. ఈ పనులన్నీ జూన్ 10వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఓ నర్సింహులు, డీఈఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు ఆచరణలో పెట్టాలి



పాలమూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి అన్నారు. అంబేడ్కర్ ఆశయాలు ప్రసంగాల్లోనే కాదు ఆచరణలో చూపాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని సోమవారం జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తితోపాటు ఇతర న్యాయమూర్తులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు అంబేడ్కర్ ఆశయాలకు, సిద్ధాంతాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. భావితరాలకు ఆయన అందించిన రాజ్యాంగం ఎంతో ఘనమైందన్నారు. ఒక న్యాయవాదిగా ఆయన పనిచేసిన విధానాలను అలవర్చుకొని ఇక్కడి న్యాయవాదులు కక్షిదారులకు సరైన న్యాయం చేయాలని, కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఒకరిపై ఒకరికి ద్వేషం పెంచేలా కాకుండా కక్షిదారులకు సమన్యాయం అందేలా చూడాలని అభిప్రాయపడ్డారు. జిల్లా కోర్టులో ఉన్న కేసుల పరిష్కారానికి న్యాయవాదులే ఒక వారధిగా ఉండి సరైన దిశలో తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి సంధ్యారాణి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతోనే అగ్ని ప్రమాదాల నివారణ

మహబూబ్‌నగర్ క్రైం: చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే అగ్ని ప్రమాదాలు నివారించే అవకాశం ఉందని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కిషోర్ అన్నారు. అగ్నిప్రమాదాల వారోత్సవాల సందర్భంగా సోమవారం జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్, పెట్రోల్ ద్వారా జరిగే అగ్ని ప్రమాదాలను ఎలా అదుపు చేయాలో అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాద వారోత్సల సందర్భంగా జిల్లాలో ఆస్పత్రులు, పాఠశాలలు, గ్యాస్ గోదాంలు, హోటళ్లు తదితర ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎండలు అధికంగా ఉన్న సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. పల్లెల్లో గడ్డివాములు, పూరిగుడిసెలు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతోపాటు వివిధ రకాల ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయని, సెల్‌ఫోన్ పేలడం, షార్ట్‌సర్క్యూట్, గ్యాస్ సిలిండర్ల వల్ల వివిధ రకాల ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ఎండలు బాగా పెరగడం కూడా ఒక కారణమన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే 101కు సమాచారం ఇవ్వాలన్నారు. బాధితులు ఎవరైన మంటలను మొదటే అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నం చేయాలి తప్ప మంటలు పెరిగిన తర్వాత దగ్గరకు వెళ్లరాదన్నారు.



క్లుప్తంగా

మహిళ దారుణ హత్య

- ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో ఆలస్యంగా వెలుగులోకి..



పురుగుల లక్ష్మమ్మ (ఫైల్)

నవాబుపేట: శరీరంపై ఉన్న ఆభరణాల కోసం మహిళను హత్య చేసిన ఘటన మండల కేంద్రంలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు, స్థానికుల కథనం మేరు.. మండల కేంద్రానికి చెందిన పురుగుల లక్ష్మమ్మ (48) భర్త మృతిచెందడంతో ఒక్కతే ఉంటుంది. నాలుగు రోజుల కిందట ఇంట్లోకి దూరిన దుండగుడు ఆమెను హత్య చేసి వంటిపై ఉన్న ఆభరణాలు తీసుకొని ఇంటికి తాళం వేశాడు. సోమవారం ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో పక్కింటివారు బంధువులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి పోలీసుల సమక్షంలో ఇంటి తాళం పగలగొట్టి లోనికి వెళ్లి చూడగా రక్తపు మడుగులో మృతదేహం కనిపించింది. శరీరంపై ఆభరణాలు, కాళ్ల కడియాలు, గొలుసులు లేకపోవడంతో వీటి కోసమే హత్య చేసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. కాగా లక్ష్మమ్మ కుమారుడు పోలీసు ఉద్యోగం చేస్తుండగా.. ఎన్నికల నేపథ్యంలో చెన్నైలో విధులు నిర్వర్తిస్తున్నారు. కోడలు వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు. రూరల్ సీఐ గాంధీనాయక్ ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

యువకుడి బలవన్మరణం



నరేందర్ (ఫైల్)

బిజినేపల్లి: మండలంలోని వట్టెం గ్రామంలో ఓ యువకుడు ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నరేందర్ (25) హైదరాబాద్‌లో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుండేవాడు. ఉగాది పండుగకు ఇంటికొచ్చి తిరిగి హైదరాబాద్ వెళ్లలేదు. ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో అందరూ పడుకున్న తర్వాత ఉరేసుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున లేచి చూసిన కుటుంబ సభ్యులకు నరేందర్ ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. నరేందర్ ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ విషయాన్ని ఎస్ఐ నాగశేఖరరెడ్డి వద్ద ప్రస్తావించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

కర్ణాటకలో వలస కూలి మృతి

ఊట్కూరు: మండలంలోని పెద్దజట్రం చెందిన నీరటి బాలప్ప కర్ణాటకలోని ఓబీలీ పట్టణంలో భవననిర్మాణం పనులు చేస్తూ ప్రమాదవశాత్తు శనివారం మృతిచెందాడు. కుటుంబసభ్యులు మృతదేహాన్ని సోమవారం స్వగ్రామానికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటరామారెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబాన్ని పరామర్శించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతి చెందిన వలస కూలీ నీరటి బాలప్పకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. గ్రామానికి చెందిన గుంపు మేస్త్రీ ముష్కరాము వద్ద 9 నెలల క్రితం రూ.1.50లక్షలు అడ్వాన్స్‌గా తీసుకొని కూలీ పనులు చేసేందుకు వలస వెళ్లాడు. 13న భవన నిర్మాణ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. వలస కూలీ మృతి చెందిన విషయాన్ని గుంపు మేస్త్రీ అక్కడ పోలీసులకు ఫిర్యాదు చేయకుండా స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకువచ్చాడని సీఐటీయూ నాయకులు ఆరోపించారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, గుంపు మేస్త్రీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

జడ్చర్ల: మండలంలోని గొల్లపల్లి గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయాలైన ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రమోహన్ వివరాల ప్రకారం రాజాపూర్ మండలం చెన్నవెల్లి గ్రామానికి చెందిన గోపాల్(45), మల్లయ్యలు బైక్‌పై జడ్చర్ల నుంచి గ్రామానికి వెళ్తున్నారు. గొల్లపల్లి సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న గోపాల్ మృతి చెందగా బైక్ నడుపుతున్న మల్లయ్య తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నలుగురు అరెస్ట్

పెబ్బేరు రూరల్: పెబ్బేరు మున్సిపాలిటీలో ఈ నెల 9న అర్ధరాత్రి జరిగిన చోరీ ఘటనలో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు కొత్తకోట సీఐ రాంబాబు తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ, ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. పెబ్బేరులోని కొల్లాపూర్ చౌరస్తాలో రెండు స్కూటీలపై నలుగురు వ్యక్తులు తిరుగుతుండగా, అదుపులోకి తీసుకొని విచారించారు. వారు కర్నూల్ జిల్లా ఆరోరానగర్‌కు చెందిన చందమాల శివతో పాటు ముగ్గురు మైనర్‌లు చోరీకి పాల్పడినట్లు విచారణలో తెలిపారు. అదేరోజు వారు జోగుళాంబ గద్వాల్ జిల్లాలో కూడా దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. వారి మీద ఎలాంటి పాత నేరాలు లేవని పేర్కొన్నారు. వారి నుంచి రెండు స్కూటీలు, ఆరు సెల్‌ఫోన్లు, రెండు ట్యాబ్‌లు, రూ.3500 లభించినట్లు తెలిపారు.

పైరవీకారులదే రాజ్యం



జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయం

- జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి చిచ్చు
- రిజిస్ట్రేషన్‌ల సమయంలో చేతివాటం
- కలకలం రేపిన ఎమ్మెల్యే వ్యాఖ్యలు

జడ్చర్ల: రెవెన్యూ వ్యవస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర ప్రక్షాళన చేసింది. అవినీతి మరకలు వీఆర్‌ఓల పాపమేనంటూ ఏకంగా వ్యవస్థకే మంగళం పాడింది. అయినా రెవెన్యూ వ్యవస్థ గాడిన పడిన పాపాన పోలేదు. తప్పుడు రికార్డుల సృష్టి, అనేక మార్పులు చేర్పులకు వేదికగా మారిందన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. సాక్షాత్తు ఓ ఎమ్మెల్యే తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, వాటిని తమ ప్రభుత్వం ఉపేక్షించబోదని బహిరంగంగా చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టిస్తున్నాయి.

మందలించిన ఎమ్మెల్యే

తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి పెరిగిపోయిందని స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి బహిరంగంగా చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన తన ప్రసంగంలో తహసీల్దార్ కార్యాలయంలో డబ్బులు ముట్టనిదే పని కావడం లేదని పేర్కొన్నారు. అంతేగాక ఇందుకు కారణమైన సిబ్బందికి నేరుగా ఫోన్ చేసి మందలించినట్లు తెలిసింది.

సేవలకు అంతరాయం

తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం భూ రిజిస్ట్రేషన్లకు అంతరాయం ఏర్పడింది. దాదాపు 30 రిజిస్ట్రేషన్లు ఉండగా తహసీల్దార్ నుంచి డిప్యూటీ తహసీల్దార్‌కు లాగిన్ మార్పు చేయడంతో సాంకేతిక సమస్యలు కలిగి రిజిస్ట్రేషన్ల నమోదుకు అవరోధం కలిగింది.

దిద్దుబాటు చర్యలు

ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కలెక్టర్ దిద్దుబాటు చర్యలు చేపట్టారు. అందులో భాగంగానే తహసీల్దార్ సత్యనారాయణరెడ్డికి రిజిస్ట్రేషన్ల బాధ్యతలను తప్పించి డిప్యూటీ తహసీల్దార్ రాజీవ్ రెడ్డికి లాగిన్ ఇచ్చారు. చేతివాటం ప్రదర్శిస్తున్న సిబ్బందిపై చర్యలకు స్థానిక తహసీల్దార్ జిల్లా అధికారులకు నివేదించారు.

రిజిస్ట్రేషన్ల సమయంలో చేతివాటం

తహసీల్దార్ కార్యాలయాలలో భూముల రిజిస్ట్రేషన్ సమయంలో అధికారులు, సిబ్బంది చేతి వాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు పైరవీకారులు రిజిస్ట్రేషన్ల సమయంలో జోక్యం చేసుకుని అధికారులకు, రిజిస్ట్రేషన్‌దారులకు మధ్య సమన్వయకర్తలుగా పనిచేస్తున్నారు. అమాయక రైతుల నుంచి నగదు తీసుకుని మోసం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కాగా కార్యాలయంలో ఫొటోలు, వేలి ముద్రలు తదితర వివరాలు నమోదు చేసే సిబ్బంది రైతుల నుంచి బాహాటంగానే డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నారు.

డబ్బులు అడిగారు



భూ రిజిస్ట్రేషన్ అనంతరం పాసుబుక్ ప్రింట్ తీసేందుకు సిబ్బంది రూ.500 అడిగారు. డబ్బులు ఎందుకు ఇవ్వాలంటూ గొడవకు దిగి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో ప్రింట్ తీసి ఇచ్చారు. అమాయక రైతులను డబ్బుల కోసం పట్టి పీడించడం తగదు.

– మహిపాల్‌రెడ్డి, రైతు, బాదేపల్లి

తమ దృష్టికి తీసుకురండి



భూ రిజిస్ట్రేషన్ల సమయంలో ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలి. ప్రభుత్వ సేవలకు డబ్బులు ఇవ్వడం సరి కాదు. పనుల కోసం వచ్చే వారు పైరవీకారులు, మధ్యవర్తులను ఆశ్రయించవద్దు. నేరుగా సమస్యల పరిష్కారానికి తమను సంప్రదించాలి.

– సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్, జడ్చర్ల

డబ్బులు అడిగితే చర్యలు



ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజల సమస్యలను పారదర్శకంగా పరిష్కరించాలి. సమస్యల కోసం వచ్చే ప్రజలను డబ్బులు అడిగి ఇబ్బందులకు గురిచేస్తే ప్రభుత్వ పరంగా చర్యలు చేపడుతాం. ప్రజలు ఎక్కడా డబ్బులు ఇవ్వొద్దు. డబ్బులు ఎవరైనా అడిగితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లండి

– అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

సలేశ్వరం జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్: సలేశ్వరంలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగే జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ సంబంధితశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ సమావేశ మందిరంలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, డీఎఫ్ఓ రోహిత్ గోపిడి, ఇతర జిల్లా అధికారులు, సలేశ్వరం ఆలయ కమిటీ సభ్యులతో జాతర ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు సమకూర్చాలన్నారు. ఈసారి జాతరకు భక్తులు అధికసంఖ్యలో వస్తారని.. అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. 3 రోజుల పాటు భక్తులను ఫర్హాబాద్ నుంచి అటవీ ప్రాంతంలోకి అనుమతిస్తామని.. భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు. అడవిలోకి ప్లాస్టిక్ వస్తువులు అనుమతించమని.. అటవీ సిబ్బందితో కలిసి పోలీస్‌శాఖ బందోబస్తు ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. రాత్రి వేళలో నడిచే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మధ్య మధ్యలో సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట డిపోల నుంచి విరివిగా బస్సులు నడపాలన్నారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో పలుచోట్ల ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటుచేసి వైద్యసిబ్బంది, అంబులెన్స్ సమకూర్చాలని సూచించారు. ఎక్కడైనా అనుకోని ఘటనలు జరిగితే అప్పటికప్పుడు తరలించేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వేసవి కాబట్టి భక్తులకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. సమీక్షలో డీఎంహెచ్‌ఓ డా. సుధాకర్‌లాల్, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి కమలాకర్‌రెడ్డి, అటవీ, పోలీస్ అధికారులు, జాతర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్షతలపై రామనామం



బియ్యపు గింజలపై 'శ్రీరామ' అని రాస్తున్న చక్రవర్తి ఆచారి



శ్రీరామనామంతో సిద్ధమైన అక్షతలు

అయిజ: శ్రీరామ నవమి రోజు నిర్వహించనున్న సీతారాముల కల్యాణానికి సంబంధించి బియ్యం గింజలపై 'శ్రీరామ' నామం రాసి అక్షతలను సిద్ధం చేశాడు ఓ అర్చకుడు. వివరాలు ఇలా.. మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల గ్రామానికి చెందిన అర్చకుడు చక్రవర్తి ఆచారి గత 10 పదేళ్ల నుంచి శ్రీరామ నవమిరోజు నిర్వహించే కల్యాణానికి ఉపయోగించే అక్షతలపై శ్రీరామ అని రాస్తూ భక్తిని చాటుకుంటున్నాడు. ఈ సారి సైతం 35 వేల బియ్యపు గింజలపై రాముడి పేరు రాసినట్లు వివరించారు.

వైభవంగా రథోత్సవం



ఆలయంలో రథోత్సవం

జోగుళాంబ శక్తిపీఠం: వారోత్సవంలో భాగంగా అలంపూర్ ఆలయాల్లో సోమవారం సాయంత్రం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించి పూలతో ముస్తాబు చేసిన రథంపై ఉంచి ఆలయంలోని ప్రాకార మండపంలో ఊరేగించారు. భక్తులు స్వామివారి నామస్మరణ చేస్తూ రథోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో జరిగే దశవిధ హారతుల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉత్సాహంగా ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు



ఎంపికలకు హాజరైన క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం జిల్లాస్థాయి సీనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు నిర్వహించారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భాను కిరణ్ మాట్లాడుతూ కరీంనగర్‌లో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రస్థాయి సీనియర్ ఫుట్‌బాల్ టోర్నీ జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర స్థాయి టోర్నీలో జిల్లా జట్టు మెరుగైన ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కిషోర్, మీర్‌వాజిద్, నికేష్ పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌తో మెరుగైన శిక్షణ



మాట్లాడుతున్న చైర్మన్ దీపక్ జాన్

స్టేషన్ మహబూబ్‌నగర్: నిరుద్యోగ క్రిస్టియన్ మైనార్టీ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లతో మెరుగైన శిక్షణ అందజేసి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో రక్షణ దుర్గం, జీసస్ పవర్ అపోస్టలిక్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో దైవ సేవకుల సహవాసం ఉమ్మడి జిల్లా వేదిక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సంక్షేమ పథకాలను క్రైస్తవం సమాజం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే పెద్ద పరిశ్రమలవారితో మాట్లాడమని, స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ అనంతరం ఉద్యోగవకాశాలు కల్పిస్తామని తెలిపారు. మహిళల స్వయం ఉపాధి కోసం రుణాలు ఇచ్చే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. చర్చిలు, పాస్టర్లు, క్రైస్తవులకు భద్రతా విషయంలో ప్రతి జిల్లాలో ఒక టీం ఏర్పాటు చేస్తామని చెప్పారు. పాస్టర్లకు గౌరవవేతనం ఇచ్చే అంశం అసెంబ్లీ మేనిఫెస్టోలో పెట్టారన్నారు. పాస్టర్లకు ఎంత మేరకు గౌరవవేతనం ఇవ్వాలనే దానిపై ఆలోచిస్తున్నట్లు, కచ్చితంగా అందజేస్తామని తెలిపారు. పాస్టర్లకు జీవిత బీమా ఇన్సూరెన్స్ కల్పిస్తామని, ఈ మేరకు సీఎం దృష్టికి తీసుకెళతామని అన్నారు. పాస్టర్ రెవ.విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి మనిషికి సమస్యలు ఉంటాయని, దేవునివైపు చూస్తూ ముందుకు వెళితే ప్రతి సమస్య తేలికగాను, మార్గం సులభంగాను అనిపిస్తుందన్నారు. అనంతరం ఎంబీ కన్వెన్షన్ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీసీ కోశాధికారి టైటస్ రాజేందర్, హనీఫ్ అహ్మద్, దాసరి సుందర్, దాసరి శామ్యూల్, ప్రసాద్‌బాబు, ఈజే మనోహర్, శ్రీధర్, జాన్సన్, డీఆర్‌వీ ప్రసాదరావు, సైమన్స్, ఆర్.జాన్, సునీల్, విజయ్‌భాస్కర్, ప్రేమ్‌రాజ్, ప్రభాకర్, విజయభూషణం తదితరులు పాల్గొన్నారు.

సుబాబుల్ తోట దగ్ధం



శాంతినగర్: ప్రమాదవశాత్తు సుబాబుల్, చెరుకుతోట దగ్ధమైన ఘటన వడ్డేపల్లి మండలంలోని బుడమొర్సులో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బుడమొర్సు శివారులో రైతులు రాజు, ఈశ్వర్, శేఖర్ ఐదు ఎకరాల్లో సుబాబుల్ చెట్లు సాగు చేశారు. సోమవారం సాయంత్రం మంటలు ఎగిసి పడుతుండగా గమనించిన తోటి రైతులు సమాచారం అందించారు. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. రాంబాబు చెరుకుతోట ఎకరం, ఈశ్వరన్న సుబాబుల్ ఎకరన్నర, శేఖర్ ఎకరన్నర, రాజుకు చెందిన రెండెకరాలు అగ్నికి ఆహుతైనట్లు బాధిత రైతులు వివరించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఐదెకరాల్లోని మొత్తం సుబాబుల్, ఎకరం చెరుకుతోట అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో రూ.6 లక్షలు నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమీపంలోని ఇతర రైతులకు చెందిన సుబాబుల్ చెట్లు కాపాడగలిగారు. ఈ విషయమై ప్రభుత్వం, అధికారులు స్పందించి బాధిత రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలని గ్రామస్తులు కోరారు.

భారీగా నగదు పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

మహబూబ్‌నగర్ క్రైం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా పోలీసులు తనిఖీలు విస్తృతం చేస్తున్నారు. వన్‌టౌన్ పోలీసులు క్లాక్‌టవర్‌తో పాటు పరదేశి నాయుడు చౌరస్తాలో రవీంద్రనగర్‌కు చెందిన కనికె సంజయ్‌కుమార్ వద్ద రూ.2లక్షలు, షేక్ ఫరాన్ వద్ద రూ.5,27,135నగదు సీజ్ చేశారు. దీంతో పాటు టూటౌన్ పోలీసులు న్యూటౌన్‌లో మల్లికార్జున్ వద్ద రూ.7లక్షల నగదు సీజ్ చేశారు.

గోపాల్‌పేట: వనపర్తి జిల్లా సరిహద్దు బుద్దారం గండి సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద సోమవారం నగదు సీజ్ చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. హైదరాబాద్ చెందిన శివరథం వనపర్తి నుంచి హైదరాబాద్‌కు రూ.52వేలు కారులో తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నారు. ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశామని ఎస్ఐ వివరించారు.

బాలానగర్: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టులో సోమవారం నంద్యాల జిల్లా గడ్డివేములకు చెందిన బాబునాయక్ వద్ద రూ.1.10 లక్షలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మొబైల్ దుకాణంలో చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: మొబైల్ దుకాణంలో చోరీకి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలోని ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. జిల్లా కేంద్రానికి చెందిన ఆనంద్ శ్రీపురం రోడ్డులో మొబైల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు షాపులోకి ప్రవేశించి దుకాణంలో ఉన్న రూ.30వేల విలువైన సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులు చోరీ చేశారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

- 30 తులాల బంగారు, రూ.4.80 లక్షల నగదు స్వాధీనం
- సిబ్బందికి రివార్డులు అందజేత
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ గుణశేఖర్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ గుణశేఖర్



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలో వరుస దొంగతనాలు చేస్తున్న అంతర్రాష్ట్ర నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 30 తులాల బంగారు ఆభరణాలు, రూ.4.80 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ గుణశేఖర్ వివరించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిందితుల వివరాలును విలేకరులతో వెల్లడించారు. మార్చి 13న పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బీరోలు గ్రామానికి చెందిన క్రిష్ణవర్ధన్‌రెడ్డి కుమార్తె వివాహం కోసం 28 తులాల 50 గ్రాముల బంగారు ఆభరణాలను(ఫంక్షన్ హాల్)గదిలో భద్రపరుచుకున్నాడు. ఈ క్రమంలో ధరూర్ మండలం నీలహళ్లికి చెందిన ఈడిగి ప్రవీణ్ ఆ బంగారు ఆభరణాలను చోరీ చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించారు. సోమవారం హైదరాబాద్ శివారులో ఉన్నట్లు గుర్తించి అక్కడి పోలీసుల సాయంతో నిందితుడిని అరెస్టు చేసి 20.29 తులాల బంగారు ఆభరణాలు, రూ.80 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ వివరించారు.

మరో ఇద్దరి అరెస్టు..

మార్చి 26న జిల్లా క్రేందంలోని రాజేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూర్‌కు వెళ్లారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా ఎమ్మిగనూర్‌కు చెందిన మాచర్ల శ్రీకాంత్, నంద్యాల జిల్లా కేంద్రానికి చెందిన మహ్మద్ రఫీ కలిసి ఇంటి తాళం ధ్వంసం చేశారు. ఇంట్లోని 42 తులాల బంగారు ఆభరణాలు, రూ.12.50 లక్షల నగదును అపహరించారు. కేసు నమోదు చేసుకున్న పట్టణ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించామన్నారు. పట్టణ శివారులో అనుమానాస్పదంగా నిందితులు సంచరిస్తున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుల కదలికలను గుర్తించి పట్టణ శివారులో ఇద్దరు వ్యక్తులను సోమవారం అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో వారు నేరం చేసినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.4 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిపై కర్నూల్, కొడుమూర్, ఎమ్మిగనూర్ పోలీస్‌స్టేషన్లలో చోరీల కేసులు ఉన్నాయన్నారు. వీరిని గద్వాల కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏఎస్పీ తెలిపారు. త్వరలో బాధితులకు వారి నగదు, బంగారు ఆభరణాలను కోర్టులో డిపాజిట్ చేసి వారికి అందజేస్తామన్నారు. నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టి సీసీ కెమెరాల నిపుణులు, పోలీసు సిబ్బంది కేసుల ఛేదనలో కృషి చేశారన్నారు.

సిబ్బందికి రివార్డులు..

కేసుల ఛేదనలో గద్వాల సీఐ భీమాకుమార్, పట్టణ ఎస్ఐ శ్రీనివాస్, సీసీ కెమెరాల నిపుణులు చంద్రయ్య, ఇస్మాయిల్‌కు ఏఎస్పీ రివార్డులను అందజేశారు. జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానితులు ఎవరైన కాలనీలో సంచరిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందజేయలన్నారు. సమావేశంలో డీఎస్పీ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.